## 22. యోగక్షేమమ్ వహామ్యహమ్

**క్రిందటి** నెల రెండో ఆదివారంనాడు మా కంపెనీ హాస్పిటల్ 20వ వ్యవస్థాపక దినోత్సవం జరిగినప్పుడు చూసేదాకా ఈ హాస్పిటల్ ఇంత గొప్పగా నడుస్తూందని నాకు తెలీదు. కంపెనీ కార్మికులు, ఆఫీసు ఉద్యోగులు, రకరకాల వర్క్ యూనిట్ల అధికారులు; సుమారు 1200 మంది వచ్చారు. వీళ్ళ కాక హాస్పిటల్ స్టాఫ్ (అంటే డాక్టర్లు, నర్సులు ఇంకా పేరామెడికల్ స్టాఫ్; వీళ్ళు) 300 మంది పైగా ఉంటారు. ఏదో ఒక రాజకీయ పార్టీ ప్రచారసభకి లారీల్లో జనాన్ని తోలుకొచ్చినట్లు మా హాస్పిటల్‌లోని డాక్టర్లు మా వర్క్‌యూనిట్లు అన్నిట్లోకీ వెళ్ళి ఈ మీటింగుకి జనాన్ని కూడగట్టుకుని వచ్చారా - అనిపించింది నాకు.

ఇవాళ ఉదయం మా మేనల్లుడు సైకిల్ తొక్కుకుంటూ ఉండగా హోండా నడుపుతున్న ఒక "హీరో" డాష్ కొట్టి మా వాణ్ణి కింద పడేశాడు. వాడు మా కుటుంబ సభ్యుడు కాడు. అందుచేత నాకు నచ్చే హాస్పిటల్‌లో చికిత్స చేయించి ఆ ఛార్జీలు పెట్టుకునే సదుపాయం లేదు. మా సంస్థ వ్యవస్థాపించిన ఈ హాస్పిటల్‌లో నా పలుకుబడి ఉపయోగించి వాడికి ఉచిత వైద్యం చేయించే అవకాశం ఉంది.

అలా వచ్చిపడ్డాను, ఈ (మా) హాస్పిటల్‌కి. అబ్బో; ఏమి జనం, ఏమి జనం! ఇంత ఎక్కువమంది లేబరు వైద్యం కోసం హాస్పిటల్‌కి వచ్చేసి పనిగంటలని హాస్పిటల్ నెపం పెట్టి వృథా చేస్తున్నారే, ఇంక ఉత్పత్తి, ఉత్పాదన లక్ష్యాలను ఎలా చేరుకుంటాం, ఎలా అధిగమిస్తాం - అని కొన్ని క్షణాలపాటు నాలో బాధ్యతాప్రోదితమైన ఆవేదన కలిగింది.

నన్నూ నా కారుడ్రైవరు నడిపించుకొస్తున్న మా మేనల్లుణ్ణీ చూసిన జనంలో కొందరు "జి.యమ్.గారు", "జి.యమ్.గారు"! అని గుడగుడలాడుకుంటూ వెయిటింగ్ హాల్‌లో ఉన్న కుర్చీల్లోంచి లేచి నిలబడ్డారు. వాళ్లలో కొందరికి టోకెన్‌లు పంచిపెడుతున్న 'మెడికల్ అసిస్టెంటు' ఆ పని ఆపేసి కారిడార్లో ఉన్న వీల్‌ఛైర్ లాక్కొచ్చి మావాణ్ణి అందులో కూర్చోబెట్టాడు. అప్పుడు నాకు వంగి వంగి దండాలు పెట్టాడు. వీల్‌ఛైర్‌ని తానే తోసుకుంటూ 'ఎమర్జెన్సీ వార్డుకి ఎల్దాం రండి సార్' అని ముందుకు సాగాడు. అతని వెనకాల నేనూ వెళ్లాను. నా కారు డ్రైవరు మాత్రం "ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ గారిని తీసుకొస్తానండి. తమరు అబ్బాయితో ఉండండి" అని అటు వెళ్లాడు.

క్షణాల మీద పనులు జరిగిపోయాయి. రెండు ఎక్స్-రేలు తీశారు. ఫ్రాక్చర్ ఏదీ లేదని తెలుసుకుని బ్యాండేజి కట్టారు. అర్జంటుగా ఒక ఎ.టి.యస్. ఇంజక్షను ఇచ్చారు.

కొన్ని టాబ్‌లెట్లు, ఒక ఆయింటుమెంటు : ఇచ్చారు. మా మేనల్లుడు నా కుటుంబసభ్యుడిగా రికార్డులో లేదు కనుక కేసు షీటు తెల్లకాగితం మీద రాసిచ్చేశారు.

❖ ❖ ❖

హెడ్ ఆఫీస్ చేరి నా ఛాంబర్స్‌లో సెటిలయ్యాక మా హాస్పిటల్ గురించి ఆలోచన సాగించాను.

మాది ఒక మల్టీనేషనల్ కంపెనీ.

కొన్ని లోహాల ముడిపదార్థాలు (ఖనిజాలు) రోడ్డు ద్వారాను, రైలు ద్వారాను రప్పించుకుంటాము. కొన్ని లోహేతర పదార్థాలను కూడా రప్పించుకుంటాం. వీటినన్నింటిని రకరకాల కాంబినేషన్‌లలో మిక్సింగ్‌లు చేయించడానికి ఒక కెమికల్ యూనిట్ ఉంది.

అక్కడ తయారయ్యే పదార్థాలలో కొన్ని ఫార్మాస్యూటికల్ కంపెనీలకి వెళతాయి. మరికొన్ని కెమికల్ కంపెనీలకు వెళతాయి. ఇంకా కొన్ని సరాసరి అమ్మకాలను నిర్వహించే ఏజెన్సీలకు వెళతాయి.

మేము తయారుచేసే ఈ మిశ్రమాలలో కొన్ని మలేషియా, ఈస్ట్ ఇండీస్ మొదలైన ప్రదేశాలకి నౌకల ద్వారా వెళ్తాయి.

అలా ముడి పదార్థాలను రైల్వేవారి నుంచి అందుకునే ప్రక్రియతో మొదలై తయారయిన సరుకులను లారీలకు, నౌకలకు ఎక్కించేవరకు సుమారు పదకొండు వేలమంది లేబరు, చిన్నస్థాయి ఉద్యోగులు, వాహనాల డ్రైవర్లు - ఉంటారు.

వీళ్లుకాక ఆఫీసులో రకరకాల శ్టాఫ్ ఉంటారు. వస్తున్న ముడిపదార్థాల నాణ్యత చూసే కెమిస్ట్‌లు, మా ఉత్పత్తులు తయారుచేయగల యంత్రాల ఆపరేటర్లు, మా నుండి బయలుదేరే ప్రొడక్టుల నాణ్యతను నిర్ధారించే క్వాలిటీ కంట్రోల్ స్టాఫ్, ఎక్కౌంటెంట్లు, ఉత్తర ప్రత్యుత్తరాల శాఖవారు, స్టోర్ కీపర్లు - ఒకటి కాదు, రెండు కాదు మొత్తం ఎనిమిది విభాగాలు ఉండగా సరిగ్గా ముప్ఫై ఏళ్ల క్రితం వైద్య, ఆరోగ్య శాఖ ఒకటి వచ్చింది.

వైద్య, ఆరోగ్యశాఖలో డాక్టర్లు, ఫార్మాసిస్టులు, పేరామెడికల్ స్టాఫ్, నర్సులు, ఎక్స్‌రే, ఇ.సి.జి. సాంకేతిక నిపుణులు, ఆయాలు, వార్డ్‌బాయ్‌లు, శానిటరీ స్టాఫ్, ఇంతమంది ఉన్నారు. ఎందుకంటే ఆ ఆసుపత్రి సుమారు పదకొండువేల మందికి వైద్యం అందించడానికి పుట్టింది కనుక. అంతకుముందు ఈ ఉద్యోగస్తులు, లేబరు, వాళ్ల కుటుంబాలు - ఎవరు, ఎప్పుడు జబ్బుపడినా అసౌకర్యానికి గురి అయినా, వాళ్లందరూ వాళ్లకి దయ, అనుకూలత చూపగల డాక్టర్లను సంప్రదించుకుని బిల్లులు వ్రాయించుకుని ఎక్కౌంట్స్ సెక్షన్‌లో పరిహారం పుచ్చుకునే సంప్రదాయం.

ముప్ఫై ఐదు ఏళ్లనాడు ఢిల్లీ నుంచి మా ఛైర్మన్ "రామ్ నారాయణ్ గయక్‌వాడ్" గారు మా ఫ్యాక్టరీ కార్యకలాపాలు ఎలా నడుస్తున్నాయో, కార్మికుల ఆర్థిక, ఆరోగ్య

పరిస్థితులేమిటో తెలుసుకోడానికి వారం రోజులు క్యాంప్ వేసుకుని వచ్చినప్పుడు ఈ హాస్పిటల్ ఆలోచన మొగ్గ తొడిగింది.

వాళ్ల నాన్నగారు ఈ ఊళ్లో ఈ ఫ్యాక్టరీ నిర్మించినప్పటికంటే (అంటే ముప్పై ఐదేళ్ల కిందట) ఇంతమంది కార్మికులూ, ఉద్యోగులూ లేరు. రామ్‌నారాయణ్ గారి హయాంలో ఈ కంపెనీ ఎన్నో రకాల అభివృద్ధులను సాధించగా వ్యాపారపు టర్నోవర్ పదిరెట్లు పెరిగింది. అప్పుడు అధికారుల, ఉద్యోగుల, కార్మికుల వైద్యానికి అవుతున్న ఖర్చుకు ఏడెనిమిది రెట్లు ఒకేసారి పెట్టుబడి పెట్టగలిగితే ఒక ఉన్నతస్థాయి ఆసుపత్రినే నిర్మించవచ్చునని, మెడికల్ బిల్స్ ద్వారా ఒక ఏడాది ఖర్చు అవుతున్న సొమ్ము డాక్టర్ల, నర్సుల, ఇతర ఉద్యోగుల జీతాలకు సరిపోతుందని; లెక్కవేసుకున్నారు. భారతదేశం మొత్తం మీద ఇండస్ట్రియల్ ఇన్‌కమ్‌టాక్స్ చెల్లించే కంపెనీలలో మాది 53వ స్థానం. కనుక కేంద్ర ప్రభుత్వపు కార్మిక సంక్షేమశాఖ మాకు ఈ హాస్పిటల్ నిర్మాణం నిమిత్తం తిరిగి కట్టక్కరలేని గ్రాంటుగా ఈ ఖర్చులో 30 శాతం వరకు ఇవ్వవచ్చునని తెలిసి కాగితాలు, కంజాయింపు చేసుకున్నారు.

❖ ❖ ❖

ఇవాళ ఆసుపత్రిలో అడుగుపెట్టినది మా "మేనల్లుడి ఉచిత వైద్యం" కోసమే అయినా అక్కడి జనాన్ని చూసి నాకు పూర్తిగా మతిపోయింది. ఉద్యోగులూ కార్మికులూ కలిసి ఎలా లేదన్నా 11,000 మంది ఉంటారు. వాళ్ల భార్యలుంటారు. ఒక్కొక్క జంటకు కనీసం ముగ్గురు పిల్లలనుకున్నా మొత్తం 55,000. ఇంకా సగం మందికి తల్లిదండ్రులు బ్రతికి ఉంటారు. పోనీ వాళ్లలో సగంమంది కాలం చేశారనుకున్నా మొత్తం అధికారలెక్క ప్రకారం 60-65 వేల మంది వరకు పేషెంట్లు ఉంటారు.

ఆదివారాలూ, జాతీయ సెలవు దినాలూ తీసేస్తే ఆసుపత్రి ఏడాదికి 291 రోజులు పనిచేస్తుంది. రోజుకి కనీసం 300 మంది పేషెంట్స్ ఉంటున్నారు. ఒక్కొక్కరికి 30 రూపాయల మందులు, ఇంజక్షన్లు - అనుకున్నా ఏడాదికి మొత్తం ఖర్చు దరిదాపు 30 లక్షలు. ఎక్స్‌రేలు, ఇ.సి.జి.లు, ఇంటికి ఇచ్చే మెడబెల్ట్‌లు, కాళ్లకో జెబ్బకో చుట్టబెట్టుకునే క్రేప్ బేండేజీలు ఇవన్నీ ఐదు లక్షలు ఉండచ్చు. ఇంకా డాక్టర్ల నుంచి ఆయాల వరకు స్వీపర్ల వరకూ జీతాలు నెలకి కోటి రూపాయలు. కరెంటు బిల్లు నెలకి 50,000. ఇంకా ఎన్నో ఉంటాయి.

ఫైనాన్స్ మేనేజర్‌ని, లేబర్ మేనేజర్‌ని, ఎస్టేట్ ఆఫీసర్‌ని - పిలిచాను. వాళ్లు చెప్పిన లెక్క ప్రకారం ఈ హాస్పిటల్ అంటూ లేకపోతే హాస్పిటల్ డాక్టర్లకీ, మరికొందరి క్వార్టర్స్‌కీ కట్టే మున్సిపల్ టాక్స్ మొదలైనవి ఉండవు. అంటే నెలకి రెండు కోట్ల ఆదా.

ఈ హాస్పిటల్ 36 ఎకరాల విస్తీర్ణంలో పరచుకుని ఉంది. 35 ఏళ్ల కిందట కనుక ఇది ఎకరానికి లక్ష రూపాయలకు వచ్చింది. ఇప్పుడు ఏదైనా కార్పొరేట్ హాస్పిటల్

వ్యవస్థాపించుకునే ఆలోచన ఉండే వారికి దీనిని యధాతథంగా అమ్మేస్తే బిల్డింగు, క్వార్టర్స్ హాస్పిటల్‌లోని ఎక్స్‌రే తదితర యంత్ర సముదాయం, ఆపరేషన్ థియేటర్లు, వార్డులలో ఉన్న మంచాలు, పరుపులు, ఫర్నిచరు, టెలిఫోన్ లైన్లు, ఎలక్ట్రికల్ ఫిటింగులు, వైరింగులు, రెండు లిఫ్టులు, లేబొరేటరీ ఎక్విప్‌మెంట్‌లు ఈ సమస్తమైన స్థిరాస్తికి 400 కోట్ల రూపాయలకు మించి వస్తుంది.

డాక్టర్లకు, ఇతర సిబ్బందికి ఉద్యోగాలు పోగొట్టుకుంటున్నందుకు నష్టపరిహారం మహా అయితే 20-25 కోట్లు కావచ్చు. మిగిలిన సొమ్ము ఇన్వెస్ట్‌మెంట్సులో వేసేస్తే వచ్చే వడ్డీ ఇప్పుడు నికరంగా ఉన్న సిబ్బంది మందుల ఖర్చులకు మించిపోయేదిగానే వస్తుంది.

ఒక నామమాత్రపు ఆసుపత్రి నిర్మించుకుని రకరకాల వ్యాధులను అసౌకర్యాలను డయాగ్నోసిస్ చేయగల జూనియర్ డాక్టర్లను పదిమందిని అక్కడ ఉంచి మన ఉద్యోగులు వీళ్ల సలహా లేకుండా ఇతర ఆసుపత్రులకు, డాక్టర్ల వద్దకు వెళ్లకుండా కట్టుదిట్టం చేసుకుంటే కార్పొరేట్ ఫండ్ మీద వడ్డీగా వచ్చే సొమ్ము కూడా కొంత మేర ఆదా అవుతుంది.

❖ ❖ ❖

డ్రెస్సింగ్ రూమ్ నుంచి, లేబరేటరీ నుంచి కాటన్, స్పిరిట్, బేండేజి క్లాత్, ఆయింట్‌మెంట్స్, యాసిడ్స్, హైడ్రోబేస్‌డ్ లిక్విడ్స్ మొదలైనవి, హాస్పిటల్ సెక్యూరిటీ కళ్లు గప్పి లేదా వాళ్లతో కుమ్మక్కై బైటకు తీసుకుపోతున్నారు. వాటిని ప్రైవేటు డాక్టర్లకు, చిన్న చిన్న మెడికల్ షాపులకు సరఫరా చేసి వాటి ధరలను వసూలు చేసుకుంటున్నారు.

ఈ వివరాలు కాగితం మీద పెట్టవచ్చునా అనే సందేహాన్ని వెలిబుచ్చాడు.

నేను దర్జాగా నా ఫ్లెక్సీ రివాల్వింగ్ చేర్‌లో కూర్చుని చిరునవ్వు, సిగరెట్టూ వెలిగించుకుంటూ "మిస్టర్ హయగ్రీవరావు! ఇవన్నీ రాస్తే ఏమౌతుందో నీకు తెలీదా?" అన్నాను.

హయగ్రీవరావు వెర్రిమొహం వేశాడు.

"అన్నిటికన్నా ముందు నీ ఉద్యోగం పోతుంది. నాకు ఛార్జ్‌షీట్ వస్తుంది."

❖ ❖ ❖

రిపోర్టు మొత్తం 126 పేజీలొచ్చింది. ప్రతీ పాయింట్‌కి బోలెడు వ్యాఖ్యానం చేసి పకడ్బందీగా వ్రాశారు. డైరెక్టుగా ఛైర్మన్‌గారికి పంపకూడదు గదా అని ముంబాయ్‌లో ఉన్న మేనేజింగ్ డైరెక్టర్ గారికి పంపాము. అయితే రిపోర్టు ముంబాయికి చేరిన 40వ రోజున నాకు ఢిల్లీ నుండి మెసేజ్ వచ్చింది. "మిక్కిలి కీలకమైనది, చాలా ముఖ్యమైనది; ఒక విషయం ఈ నెల 16వ తేదీని ఢిల్లీలో జరిగే మన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో చర్చకు వస్తున్నది. ఈ మీటింగు మీరు రాకపోయినా జరుగుతుంది. కాని రావడానికి మీకు అనుమతి ఇవ్వడమయినది."

నాకేమీ అర్థం కాలేదు. నేను పంపిన రిపోర్టు మీద జరిగే చర్చ కాదేమో..... అయితే నేను పంపిన ప్రపోజల్ ఫేస్‌వాల్యూ 400 కోట్ల రూపాయలు. కంపెనీకి చాలా లాభదాయకం. నా పరోక్షంలో నిర్ణయం తీసుకుంటే నాకు ముఖాముఖీ అభినందనలు చెప్పలేరు..... ఎందుకయినా మంచిది మళ్లీ నా ఆఫీసర్లను పిలిచి మరొక కూలంకషమైన చర్చ వేసుకుంటే మంచిదేమో. అసలు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగు నా ప్రపోజల్ మీదనేనని ఎందుకు అనుకోవాలి?

- ఇలా కల్లోలపడుతూనే వెళ్లాను.

❖ ❖ ❖

లేబర్ మేనేజర్, చీఫ్ మెడికల్ ఆఫీసరు, ఎస్టేట్ మేనేజరు, విజిలెన్స్ ఆఫీసరు, నా కుడి జబ్బతో సమానుడైన డిప్యూటీ జనరల్ మేనేజరు - అందర్నీ కూర్చోబెట్టి హాస్పిటల్ అమ్మకానికి ప్రతిపాదన, ప్రణాళిక సిద్ధం చేయమన్నాను.

అందరికంటే ముందు విజిలెన్స్ ఆఫీసరు నాతో రహస్యచర్చ కోసం ఎపాయింట్‌మెంట్ తీసుకుని నా ఛాంబర్స్‌కి వచ్చాడు. నా ఛైర్ వెనకాల ఉన్న బోర్డులలో ఒకటి తీసి చూపించాడు. "కెన్ ఐ యూజ్ దిస్ ఫర్ ఏ వైల్" (దీన్ని కొంతసేపు వాడుకుందామా?) అన్నాడు. నేను చూశాను. "పది నిమిషాల పాటు డిస్టర్బ్ చేయవద్దు అని వ్రాసిన బోర్డు అది. నేను సరే అన్నాను. నా పి.ఏ.కి చెప్పేను.

విజిలెన్స్ ఆఫీసరు చెప్పిన సంగతులు విని నా తల కాటెక్కిపోయింది.

డాక్టర్‌లలో 70 శాతం మంది ఇళ్ల దగ్గర రహస్యపు గదులను ఏర్పాటు చేసుకుని అక్కడ మా సంస్థకు సంబంధించని ఉద్యోగులకు ఇతర ప్రజలకు ఫీజు తీసుకుని వైద్యం చేస్తున్నారు. వాళ్లకు అవసరమయ్యే మందుబిళ్లలు, టానిక్‌లు, ఇంజక్షన్‌లు హాస్పిటల్ నుండి డ్రా చేసుకుని అక్కడ వాడుతున్నారు. వాటి ధరలు ఆ రోగుల దగ్గర వసూలు చేస్తున్నారు.

మన హాస్పిటల్‌లో ప్రస్తుతం డాక్టర్లుగా పనిచేస్తున్నవారిలో సర్జన్‌లు (శస్త్రచికిత్స చేయగలిగేవారు) 12 మంది ఉన్నారు. వీరిలో నలుగురు మన నగరంలో ఉన్న ప్రైవేటు, కార్పొరేటు హాస్పిటల్స్‌లో సర్జరీ బేరాలకు ఒప్పుకుంటున్నారు. వీరు సాధారణంగా సాయంకాలం 6 నుండి రాత్రి 10 వరకు ఆ పనుల మీద ఉంటారు. ఇళ్ల దగ్గర అడిగితే క్లబ్‌కు వెళ్లారనో, సినిమాకి వెళ్లారనో జవాబు వస్తుంది. నా సెల్ నెంబరు వాళ్లకు తెలుస్తుంది. కనుక నేను వేరే సెల్‌లో మాట్లాడినప్పుడు "నన్ను డిస్టర్బ్ చేయకండి. సర్జరీలో ఉన్నాను" అని ఈ నలుగురూ నాకు జవాబు చెప్పారు. ఇంకా కొన్ని చిల్లర మల్లర నేరాలు ఉన్నాయి. మాటవరసకి మన హాస్పిటల్ కాంపౌండులో 12 కొబ్బరిచెట్లు, 8 అరటిచెట్లు దాదాపు ఒక ఎకరం కూరగాయల పొలం ఉన్నాయి. వీటికి నీళ్లు మన ట్యాంకులోంచే వెళతాయి. కాని

పీటి ఫలసాయం వేలం ద్వారా గాని, కాంట్రాక్టు ద్వారా గాని అమ్మకానికి పెట్టకుండా "ఏవేవో మొహమాటాలు ఉంటాయి" అని చెబుతూ ఎస్టేట్ మేనేజర్‌గారు ఆ కాయగూరల్ని ఆఖరికి అరిటాకులు, దవ్వ, దేన్నీ వదలకుండా ఆయనే తీసుకుపోతారు.

❖ ❖ ❖

మీటింగు మా కార్పోరేట్ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పెట్టలేదు.

ముంబాయిలోనూ, అహ్మదాబాద్‌లోనూ, ట్యూటికోరిన్‌లోనూ, కొచ్చిన్‌లోనూ, హాల్దియాలోనూ ఇలా సముద్రతీర స్థలాలలో మా ప్రొడక్షన్ ఆఫీసులు మొత్తం ఎనిమిది ఉన్నాయి. ఈ ఎనిమిది చోట్లా జరిగే పనులని జనరల్ మేనేజర్లు చూసుకుంటారు. ముంబాయిలో మాత్రం మేనేజింగ్ డైరెక్టరు ఒకరున్నారు. చేర్మన్‌గారు ఢిల్లీలో ఉంటారు. మా కార్పొరేట్ ఆఫీసు కాన్ఫరెన్స్ హాల్‌లో పన్నెండుమందికి మాత్రమే కూర్చునే ఏర్పాటు ఉంది.

ఇప్పుడు ఈ మీటింగుకి మా చేర్మన్‌గారూ, ఎమ్.డి.గారూ ఎనిమిదిమంది జి.ఎమ్‌లూ వాళ్ల పి.ఎ.లూ కాక మా కస్టమర్స్‌లో ఎక్కువెక్కువ బిజినెస్‌లు ఇచ్చే ఇతర సంస్థల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వపు డిపార్ట్‌మెంట్‌ల అధికారులు నలుగురు; ఇలా చాలా మందిమి అయ్యాము. అందుచేత మాకందరికీ రూములు తీసుకున్న హోటల్ మీటింగ్ హాల్‌ని ఈ చర్చలకుగానూ బుక్ చేశారు.

పరిచయాలు అయ్యాయి. ఎజెండా కాగితాలు పంచిపెట్టారు. మొదటి మూడు ఎజెండా ఐటమ్స్‌లో వేరే యూనిట్స్‌కి సంబంధించినవి మాత్రం ఉన్నాయి. వాటి డెలిబరేషన్స్ విషయంలో నా పాత్ర వినడం వరకే.

నాలుగవ ఐటమ్ "వైండింగ్ అప్ ఆఫ్ ఎ హాస్పిటల్" (ఒక ఆసుపత్రిని ఎత్తేయడం).

మొట్టమొదటి ప్రశ్న కేంద్ర ప్రభుత్వపు కార్మిక సంక్షేమ విభాగపు జాయింటు సెక్రటరీ నుండి నా మీదికి వచ్చింది. "మిస్టర్ నారాయణన్! మీ ప్రపోజల్‌లో మీ హాస్పిటల్ మీ యూనిట్‌కి లయబిలిటీ (భారం)గా ఉందనీ దానిని ఎసెట్ (లాభసాటి చరాస్తి)గా మార్చుకో వచ్చుననీ మీరు వివరించారు....... నేను సరిగా అర్థం చేసుకున్నానా?"

"అవును సార్, మా యూనిట్‌లో మిగిలిన డిపార్ట్‌మెంట్సు - అంటే మెటీరియల్ రప్పించుకోవడం, కెమికల్ ప్లాంటు, ట్రాన్స్‌పోర్టు, ఎక్స్‌పోర్టు అన్నీ లాభసాటి విభాగాలే. అవ్‌కోర్స్, పరిపాలనా విభాగం, ఎక్కౌంట్స్ సెక్షన్ లాంటివి ఖర్చుదారీ శాఖలే. కాని వైద్యఆరోగ్యశాఖ మా యూనిట్‌కి తెల్ల ఏనుగులా పరిణమిస్తోంది. ఏనుగు చూడడానికి అందంగా ఉంటుంది. తెల్ల ఏనుగు మరింత అందంగా ఉంటుంది. కాని దాని మేత చాలా భారవంతమైనది కదా" అన్నాను అతను బ్యూరోక్రాటే కదా అని ఓ నవ్వు విసురుతూ.

"మీ ఊరి యూనిట్ మీ కార్పొరేషన్‌లోని మిగిలిన ఏడు స్థలాల్లో యూనిట్ల కంటే ఎక్కువ లాభాలను ఆర్జిస్తూంది. మీ యూనిట్ "వార్షిక నికరలాభం" యాభై కోట్ల

రూపాయలు కాగా హాస్పిటల్ ఎక్కౌంట్ క్రింద మీరు చేస్తున్న ఖర్చు కేవలం మూడు కోట్లు మాత్రమే. అంటే ఆరుశాతం దీనివల్ల మీరు నష్టపోయేది ఎంతో లేదు కాని రకరకాల స్థాయిల్లో ఉన్న ఉద్యోగులు దాదాపు పన్నెండువేల మందిని సుఖపెడుతున్నారు. ఉచిత అన్నదానం ఎంత గొప్పదో, ఉచిత వైద్యదానం కూడా అంత గొప్పది అని నేను ఆ కార్మికులందరి తరపున మీకు చెప్పాలనుకుంటున్నాను......

"కార్మిక సంక్షేమం కోసం ఖర్చుపెడుతున్న ఈ మూడుకోట్ల రూపాయలకి పన్ను మినహాయింపు ఉంటుంది......"

"కార్మికులు, ఉద్యోగులు, అధికారులు వేరే వేరే ఆసుపత్రులకు వైద్యం నిమిత్తం వెళితే అక్కడ వాళ్లకు ఈ ఆసుపత్రిలో లభించే వైద్యం దొరుకుతుందే తప్ప ఇక్కడ దొరికే ఆదరణ, ఆప్యాయత దొరకవు....."

"బజారులో కొనుక్కుని తెచ్చుకునే ఆహారానికీ, ఇంట్లో వండుకునే ఆహారానికీ ఉన్న తేడా లాంటిది ఈ రెండు రకాల "ట్రీట్‌మెంట్"ల లోనూ ఉంటుందేమో.....

"ఈ కార్పొరేషన్‌కి ఉన్న ఎనిమిది ప్రొడక్షన్ యూనిట్లలో ఇంకెక్కడా లేనిది ఆ హాస్పిటల్ సౌకర్యం. దీనికి ఇతర యూనిట్ల దృష్టిలోనే కాక దేశప్రజలందరి దృష్టిలో కూడా ఒకానొక గౌరవభావం ఏర్పడి ఉంది."

ఇలా నా ప్రతిపాదన వాద ప్రతివాదాలకు అవకాశం ఇచ్చి వాటి సారాంశం ఆ సభలో అందరి మనసులలో నాటుకుంది. చేర్మన్‌గారు చేతివాచి చూసుకున్నారు. "మనం ఇక్కడ రెండు గంటలు గడిపాం. ఎజెండాలో ఇంకా నాలుగు ఐటమ్‌లు ఉండిపోయాయి. భోజనాలు అయ్యాక కొనసాగిద్దాం" అన్నారు.

నన్ను దగ్గరగా పిలిచి తన ప్రక్కన నేను నిల్చుని ఉండగా నా వీపు తట్టారు. మాట్లాడింది నాతోనే కాని అక్కడ మైకు ఉంది. "మిస్టర్ నారాయణన్! మన కార్పొరేషన్ ఒక మల్టీనేషనల్ ఆర్గనైజేషన్ అయినప్పటికీ ఒక సీనియర్ అధికారి మీరు. ఈ కార్పొరేషన్ మీద ఒక పెద్ద అన్నయ్యకు కుటుంబం మీద ఉండేలాంటి ప్రేమను చూపగలిగారు. మీకు నా అభినందనలు. మనం ఈ ఏడాది డిశంబరులో కాకినాడలో మన తొమ్మిదవ యూనిట్ స్థాపిస్తున్నాం. మీరు ఆ యూనిట్‌కి తగిన స్పేడ్‌వర్క్ వచ్చేనెల ఒకటవ తేదీనుండి ప్రారంభించి మన కార్పొరేషన్ మరింత ఉన్నతిని సాధించేటట్లు చూస్తారు."

చేర్మన్‌గారు తన కుర్చీలోంచి లేచారు. అందరూ చప్పట్లు కొట్టి, వారు కూడా లేచి నిల్చున్నారు.

నేను నిల్చునే ఉన్నాను కదా........

*('ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక, జూన్ 2009)*